# కర్తవ్యం



## ముక్కామల దేవీ నాగమోహనరావు

తెల్లవారింది. బయటికి వెళ్లి అర కప్పు టీ తాగి వచ్చి గదిలో కిటికీ దగ్గర కూర్చున్నాను. కిటికీలో నుంచి మెయిన్ రోడ్డంతా కనిపిస్తోంది.

రిక్షాల గణగణలు. . . సైకిలు బెల్లులు. . . కార్ల హారన్లు. . . రోడ్డంతా మారోగిపోతూంది. జనం గబగబా నడుస్తున్నారు. వాళ్ల నడక కిటికీలో నుంచి చూస్తూంటే నవ్వు వస్తోంది. రోడ్డుమధ్యనున్న పోలీసు అటూ, ఇటూ చేతు లూపుతూంటే నాట్యం కదుతున్నట్లు ఉంది. రోడ్డుమీద నడిచే వాళ్లకి బాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లా రేడియోలు, గ్రామఫోనులు ఒకటే గోల.

ఇది చాలదన్నట్లుగా ఆ సౌండ్ ఇంజినీరింగ్ షాపు వాడు బయట పెద్ద లౌడ్‌స్పీకర్ పెట్టి రోడ్డును అదర కొడుతున్నాడు.

రోడ్డు పక్కనే చిన్న టీ కొట్టు ఉంది. ఆ కొట్టువాడి పేరు రహీమ్. వాడి కళ్లు ఎప్పుడూ లోతుకు పోయి ఉంటాయి. వాడి తల కొబ్బరిపీచులా ఉంటుంది. మనిషిపొడుగ్గా అస్థిపంజరంలా ఉంటాడు. ఊరికే అందరిమీదా చిర్రు బుర్రు లాడుతూంటాడు. ఎన్నాళ్లనుంచో వాణ్ణి చూస్తున్నాను. వాడికీ నాలాగే బ్రతుకులో ఎదుగూ, బొదుగూ లేదు. వాడి కొట్లో టీ తప్పించి మరేమీ ఉండదు. రిక్షావాళ్లు టీ తాగడానికి అక్కడికి ఎక్కువగా వస్తూంటారు. టీ కొట్టువాడికి లేవడానికే బద్ధకం. ఎందుకు వచ్చారా అన్నట్లు చూస్తాడు వీళ్లవైపు.

ఆఖరుకు, "ఏమిటి కావాలి, గురూ?" అంటాడు, వాడి కొట్లో మహా ఇంకేదో ఉన్నట్లు. ఈ రిక్షావాళ్లకు వాణ్ణి చూస్తేనే భయం, ఎక్కడ చిర్రు బుర్రు లాడతాడో అని. ఈ రిక్షావాళ్లకు వీడి దగ్గర ఖాతాలుకూడా ఉన్నట్లున్నాయి. వాళ్లందరూ నిలబడే టీ తాగేసి పోతూంటారు.

రహీమ్‌కు వెనకా, ముందూ ఎవరూ లేరు. అయినా నా కర్థం కాదు, పిడికెడు టీ డబ్బులతో ఎలా బ్రతుకుతున్నాడో. . . 'ప్చ్!' అనుకుంటాను.

నేను ఆ కిటికీ దగ్గరనే కూర్చుని ఆలోచిస్తూంటాను. ఈ రిక్షాలకు, సైకిళ్లకు ఎడతెరిపి ఉండదు. ఒక్కోసారి తల పగిలిపోతుందేమో అనిపిస్తుంది. టైము గడుస్తుంది. అది ఆగదు. ఏడు. . . ఎనిమిది. . . తొమ్మిది. . . నేను కదలను. ఆ కిటికీ దగ్గరనే కూర్చుంటాను. ఎండ ఎక్కే కొలదీ జనసమ్మర్దం కొంచెం తగ్గుతూంటుంది.

క్రింది అంతస్తునుండి ఇంటి యజమాని ఎవరిమీదో కేకలు వేస్తున్నాడు. అతణ్ణి చూస్తేనే నాకు భయం. దగ్గరగా ఒదిగి కూర్చున్నాను.

సరిగా పదకొండు గంటలకు అన్నం బుట్టలు పట్టుకుని నలుగురు ఆడవాళ్లు వచ్చి మా మేడ నానుకుని ఉన్న ప్లాట్‌ఫారమ్‌మీద కూర్చున్నారు. అదొక రకం భోజనం. కొలత ప్రకారం పెడతారు. ఖరీదు అర్ధ రూపాయి. ఆ టైముకు రిక్షావాళ్లూ, కార్ఖానాలలో పనిచేసే వాళ్లూ ఒక్కొక్కళ్లుగా అక్కడికి చేరుకుంటారు. ఇక్కడా ఈ నలుగురు ఆడవాళ్లలో ఎవరి దగ్గరకు వెళ్లాలన్నది మరో సమస్య. అందులో ముగ్గురు పడుచుగుంటలు, ఒకతె ముసలమ్మ. నేను రోజూ చూస్తూంటాను—ఈ ముసలమ్మ బుట్టకంటే ఆ అమ్మాయిల బుట్టలు త్వరగా ఖాళీ అవుతుంటాయి. వాళ్లు నవ్వుతూ, తుళ్లుతూ వెళ్లిపోతారు. ఈ ముసలమ్మ మరి కాసేపు కూర్చుంటుంది, ఎవరైనా వస్తారని. ఈ ముసలమ్మ దగ్గరకు భోజనానికి వచ్చేవాళ్లంటే నాకు చాలా ఇష్టం. మనుషులు అంటే వాళ్లే అనుకుంటాను. పాపం! లేకపోతే ఈ ముసలమ్మ ఎలా బ్రతుకుతుంది? అన్నం తినటానికి వచ్చేవాళ్లకు స్వంత అమ్మలు ఉన్నా, నిజమైన అమ్మ ఈవిడే నని అనిపిస్తుంది నాకు.

"రేపు ఇస్తాలే, మామ్మా, డబ్బులు" అంటూ ఒకడు.

ఆ ముసలమ్మ ముందు వినుక్కుంటుంది. తరవాత ఇక ఎలామా తప్పదు.

"మా మామ్మ చాలా మంచి" అంటూ వాడు తుబ్బరంగా తిని వెళ్లి పోతాడు.

ఒక్కోసారి ఆ ముసలమ్మ దురదృష్టం — అన్నం తినడానికి ఎవరూ రారు. ఉస్సూరుమని నిట్టూరుస్తుందా మామ్మ. బుట్టనిండా అన్నం అలా మిగిలిపోతుంది.

## ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక

# పరీధావి దీపావళి కథల పోటీ

ప్రతి సంవత్సరంవలెనే ఈ పరీధావి దీపావళి సందర్భంలోనూ ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక కథల పోటీ నిర్వహిస్తూంది.

విరోధికృత్ దీపావళి కథల పోటీలో 5,000 రూపాయల బహుమతులు అందజేశాము. రచయితలకు, రచయిత్రులకు ప్రోత్సాహం కలిగించాలనే సంకల్పంతో ఈ సంవత్సరం కూడా దీపావళి కథల పోటీలో మొత్తం 5,000 రూపాయల బహుమతులు ఇవ్వడానికి నిశ్చయించాము.

రచయితలూ, రచయిత్రులూ ఈ అవకాశం వినియోగించుకోవలెననీ, పాఠకులకు ఉత్తమమైన కథలు అందజేయాలనీ, మా కృషి విజయవంతంగా నెరవేరడానికి తోడ్పడాలని కోరుతున్నాము.

**మొదటి బహుమతి రు. 2,500**
**రెండవ బహుమతి రు. 1,800**
**మూడవ బహుమతి రు. 700**

### దీపావళి కథల పోటీ నిబంధనలు:

1. ఇతివృత్తం ఆంధ్రుల జీవితానికి సంబంధించినదై ఉండాలి.
2. స్వీయ రచనలేగాని, అనువాదాలు పంపరాదు.
3. రచన అరఠావు 12 x 8 అంగుళాల సైజులో 12 పేజీలకు మించరాదు.
4. సిరాతో కాగితానికి ఒక పక్కనే వ్రాయాలి.
5. బహుమతి పొందని కథలలో యోగ్యమైనవాటిని ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు ఉన్నది.
6. పోటీకి రచన పంపేటప్పుడు కవరు మీద 'దీపావళి కథల పోటీకి' అని స్పష్టంగా వ్రాయాలి.
7. పోటీకి పంపిన కథలను ఏ సందర్భంలోను తిప్పిపంపించడం జరగదు.
8. ప్రచురణకు ఏ కలం పేరు ఉపయోగించినా తమ అసలు పేరును విధిగా వ్రాయాలి.
9. రచనలను 'ఎడిటర్, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్, మద్రాసు—2'కు పంపాలి.

బహుమతి పొందిన కథలను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక దీపావళి ప్రత్యేక సంచికలో ప్రచురించగలము

| పరీధావి దీపావళి కథల పోటీకి రచనలు మాకు చేరవలసిన ఆఖరి తేది | ఆగస్టు 28, 1972 |
|---|---|


పాపం, ఒక్కోసారి కళ్లనీళ్లు పెట్టుకుంటుంది. ఆ ముసలమ్మకి ఒక కొడుకు ఉండేవాడు. వాడు ఎప్పుడూ రోడ్లమీద బలాదూర్‌గా తిరిగేవాడు. ఏదైనా పని నేర్చుకోమని వాడితో ఎప్పుడూ మొత్తుకునేదామె. ఆఖరుకు వాడు ఆ ముసలమ్మని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయాడు. ఆమె గోడుగోడున ఏడవడం మేడమీద నా చిన్న గదిలోంచి చాలా సార్లు చూశాను. ఆమెను చూస్తేనే నాకు చాలా జాలి కలుగుతుంది. ఆమెను చూస్తే మేడ వెనకాల ఉన్న ఎండి మోడువారిన జామచెట్టు జ్ఞాపకం వస్తుంది.

నిట్టూర్చాను. . . కాస్సేపు ఆలోచించడం ఆపాను. మళ్లీ రిక్షా శబ్దాలు, సైకిలు టంగుటంగులు, కార్ల మోత.

పక్కనే ఉన్న హోటల్లోంచి అయ్యరు కేకలు కర్ణకఠోరంగా వినపడుతున్నాయి. నేను ఆలోచిస్తూనే ఉంటాను. నాకు ఆకలి వెయ్యదు. వెయ్యకూడదు. వేస్తే ఎలా? నా నిరాహారదీక్ష భంగపడుతుంది! మూలనున్న కూజావైపు చూశాను. అందులో నీళ్లు ఉన్నాయో, లేదో? నీళ్లు తెచ్చుకోవడానికి బద్ధకం. లేచి కూజాను మకిలిపట్టిన ఇత్తడి గ్లాసులోనికి వంచాను. అదృష్టం— అందులో నీళ్లు ఉన్నాయి. గటగటా తాగేశాను. ముందు కళ్లు తిరిగినట్లనిపించింది. వచ్చి కిటికీ దగ్గర కూర్చున్నాను. జేబులో డబ్బులు చూశాను. పావలా ఉంది. ఆ పావలావైపు చూస్తుంటే మనస్సు సంతోషంతో ఉప్పొంగుతూంది. ఇందాకటినుంచి ఈ సంతోషాన్ని అణుచుకుంటున్నాను. బాగా ఆకలి వెయ్యాలి. అప్పుడు వెళ్లాలి. నా డిప్పే రెండిడ్లీ, సాంబారూ గుర్తొస్తుంటే నోరు ఊరికే ఊరుతూంది. కాని, ఏం చేయను? మనస్సు మరల్చుకున్నాను. కిటికీ దగ్గరనుంచి లేచి తలుపు కొంచెం తెరిచి అవతలివాళ్ల గదిలోని గడియారంవైపు తొంగి చూశాను, ఒంటిగంట. . . 'అబ్బ' అనుకున్నాను. నాలుగు గంటలకుగాని అయ్యరుగాడు సాంబారిడ్లీ తయారు చెయ్యడు. సరే, ఏం చేస్తాను? మంచినీళ్లు తాగడం మూలంగా కొంచెం ఓపిక వచ్చింది.

బయట ఎండ మండిపోతూంది. మళ్లీ ఆలోచించడం మొదలు పెట్టాను. రోడ్డుమీదకు చూశాను. జనం బాగా తగ్గిపోయారు. రోడ్డు పొయ్యిమీది పెనంలా కాలుతూంది.

రహీమ్ కొట్లో కునికిపాట్లు పడుతున్నాడు. అక్కడో రావిచెట్టు ఉన్నది. గుర్రపుబళ్లన్నీ అక్కడ ఆగుతాయి. ఆ

చెట్టు నీడకు పోయి కూర్చోవాలి అనిపిస్తుంది. ఆ చెట్టు నీడలో ఆ బండివాళ్ళు మహా సుఖంగా నిద్దర పోతారు. ఇంతింత ఆకులతో ఆ చెట్టు గాలికి అటూ, ఇటూ ఊగుతూంటే ఏదో ఏదో అనిపిస్తుంది.

నన్ను నేను ప్రశ్నించుకుంటాను.

"నీ వయసెంత?"

"ఇరవై అయిదు."

"అయితే, నీ కెవరూ తోడు అక్కర లేదా?"

నేను మాట్లాడను. నాకు నవ్వొస్తుంది. ఒక్కోసారి గట్టిగా నవ్వుతాను. మరుక్షణం హృదయం బాధగా మూలుగుతుంది. తండ్రి జ్ఞాపకం వస్తాడు. తల్లి జ్ఞాపకం వస్తుంది. అక్కచెల్లెళ్ళు, తమ్ముళ్ళు జ్ఞాపకం వస్తారు. ఆ ఇంటి దారిద్ర్యం గుర్తుకు వస్తుంది. ఎన్నాళ్లయింది ఇల్లు వదిలి? కళ్ళు మూసుకుంటాను. అవన్నీ మరిచిపోవడానికి ప్రయత్నం చేస్తాను.

మళ్లీ లేచి టైమ్ చూశాను. ఒంటిగంటన్నర. నా మనసు ఉసూరుమంది. మళ్లీ వచ్చి కూర్చున్నాను.

బయట సోడాబండివాడు సోడా, సోడా అని ఆ మండుటెండలో అరుస్తున్నాడు. కాని, నాకు తెలుసు— ఆ వెనకాల ఐస్‌క్రీమ్ బండివాడు వస్తాడు. పాపం, సోడాబండివాడి బేరం పడిపోతుందేమో అనుకుంటాను. కాదు, అది తరవాత అనుకుంటాను. సోడా అయిదు పైసలే. మరి ఐస్‌క్రీమ్ పదిహేను పైసలు. సరే, వాడూ బాగానే బ్రతుకుతున్నాడు.


వేడిగా గాలి వీచింది. ఒళ్లు ఒక్కసారి చిటపట లాడింది. ఇంకొంచెం దృష్టి ముందుకు సారించాను. అవన్నీ పళ్ళకొట్లు. వాళ్ళకేం? పూలరంగళ్ళు. తృప్తిగా తిని నీడపట్టున ఆ కొట్లలో పడుకుంటారు. ఆ పక్కన పూలకొట్లు. వాళ్ళు ఆ పువ్వుల మీద అస్తమానూ నీళ్లు గుమ్మరిస్తూంటారు. అవేమో ఎండకు ఊరికే వడిలి పోతూంటాయి. వాళ్లని చూస్తే నాకు జాలి వస్తుంది.

మధ్యాహ్నం వేళల్లో కొంచెం నిశ్శబ్దంగా ఉంటుంది. కుట్టుమిషనుల చప్పుడు మాత్రం సన్నగా, జోరుగా వినిపిస్తుంది.

ఒంట్లోంచి ఆయాసం పుట్టుకొచ్చింది. "ఉష్!" అని నిట్టూర్చాను.

"హాఁ" అని శబ్దం వినపడింది. ఇది నాకు బాగా అలవాటయిన శబ్దం. నా పక్కగదిలో ఒక తమిళుడు తృప్తిగా ముక్కుదాకా తిని పడక కుర్చీలో పడుకుని

(తరువాయి 38 వ పేజీలో)



# కర్తవ్యం



( 35 వ పేజీ తరువాయి )

ఆయాసపడుతూంటాడు. వాణ్ణి చూస్తే నాకు ఒళ్లు మండిపోతుంది. వాడి బొజ్జ ఇంతెత్తున ఉంటుంది, తలకింది దిండులా.

నీరసం వచ్చింది. ఆలోచిస్తూనే కళ్లు మూశాను. అయినా, మెదడు ఆలోచించడం మానలేదు. నిరంతరం దానికి ఒకటే ఆలోచన, ఆలోచించాలని.

మళ్లీ ఇల్లు జ్ఞాపకం వచ్చింది. భయం వేసింది. తండ్రి, తల్లి, అక్క, చెల్లెళ్లు మళ్లీ జ్ఞాపకం వచ్చారు. ఆ ఇంటిలోని దారిద్ర్యానికి కుక్క కున్న విశ్వాసముంది. అందుకే అది ఇల్లు వదలడం లేదు. నా కనుల్లో నీరు తిరిగింది. వేడిగాలికి అది కాస్త ఆరిపోయింది. కళ్లు తెరిచి చూశాను. ఎదురుగా చాపమీద కాగితాలు రెపరెపలాడుతున్నాయి. పక్కనే ఇంక్ బాటిల్, కలం ఉన్నాయి. నేను వ్రాసిన కవితలూ, కథలూ నా వైపు ఆత్రతగా చూశాయి. నా కాశ కలిగింది. వెంటనే నిరాశ ఆవహించింది. అవన్నీ పనికిమాలినవిగా కనిపించాయి. అవి నాకు అన్నం పెట్టడం లేదు. నాకు వాటిమీద చాలా కసిగా ఉంది. చింపి పారేద్దామనిపించింది. అగ్గిపుల్ల వేసి కాల్చిపారేద్దాం అనిపించింది. ఆలోచించాను.

రహీమ్ గుర్తు వచ్చాడు. టీ కొట్టు పెట్టుకుని ఎలాగో ఒకలా అతను బ్రతుకుతున్నాడు.

మునలమ్మ గుర్తు వచ్చింది. అన్నాన్ని అమ్మి ఆమెకూడా ఎలాగో ఒకలా బ్రతుకుతూంది. అందరూ ఏదో విధంగా బ్రతుకుతున్నారు. నే నెందుకు బ్రతకలేకపోతున్నాను? నా కర్థం కాలేదు.

మళ్లీ రోడ్డువైపు చూశాను. ఎండ ఉధృతం తగ్గింది. వేడిగాలి మాత్రం వీస్తూంది. ఆకలి చచ్చిపోయింది. చాలా నీరసంగా మాత్రం ఉంది.

నే నెందు కిలా అయిపోయానో నా కర్థం కావడం లేదు. చదివింది బి. ఎ. ఇల్లు గుల్ల చేసి చదివాను. ఉద్యోగం దొరకలేదు. ఆఖరుకు భయం వేసి ఇల్లు వదిలి వచ్చేశాను. అప్పుడే రెండు సంవత్సరాలయింది. తిరగని ఆఫీసు లేదు. ప్రతి ఇంటర్వ్యూకు రెగ్యులర్‌గా హాజరు అయ్యేవాడిని. కాని, ఏం లాభం? నా దగ్గర అసలైన అస్త్రం లేదు. ఇంటర్వ్యూ చేసేవాళ్లకు ఉద్యోగం ఇవ్వడం ఇష్టం లేకపోతే వెధవ ప్రశ్నలన్నీ వేస్తారు.

"ఏం చదివావు?"

అది అప్లికేషన్ ఫారమ్‌లో ఉంటుంది. అయినా అడుగుతారు. చెప్తాను.

"మార్కులు బాగా రాలేదు" అని పెదవి విరిచారు.

"అమెరికా ప్రెసిడెంట్ ఎవరు?"

నాకు ఒళ్లు మండింది. వా డెవడైతే వీడి కెందుకు? ముక్కుమీద గుద్దాలనిపించింది.

ఆఖరుకు "వెళ్లు" అన్నాడు.

ఒకసారి ఓ ఇంటర్వ్యూలో ఇంటర్వ్యూ చేసే ఆయన-ఆయన కనులు మొగమాటం లేదనుకుంటాను — ఉత్తరాయణమా, దక్షిణాయనమా అన్నాడు. నేను కిక్కురుమనలేదు.

"సరే, ఇంటికి వెళ్లి రామాయణం చదువుకో" అన్నాడు.

అలాగేనని చెప్పి వచ్చేశాను.

కథలూ, గేయాలూ వ్రాయడం మొదలుపెట్టాను. కొద్ది రోజులకు ఇంకు, కాగితాలు దండుగ అనిపించింది. నేను ఎందుకూ పనికిరానని అనిపించింది. కాస్సేపు ఆలోచించడం ఆపాను. మూలనున్న అద్దం ముక్క తీసి ముఖం చూసుకున్నాను. ఎందుకో నా ప్రతిబింబం చాలా కోపంగా ఉంది.

నన్ను అడిగింది:

"అయితే ఇంకు, కాగితాలు దండుగ అంటావు?"

"కాకపోతే. . ." అన్నాను.

"అయితే ఈ కవులూ, రచయితలూ ఎందుకు రాస్తున్నారు అంటావు?"

"తిని ఉండలేక."

"మూతిమీద తన్నానంటే ముప్పయి రెండు పళ్లూ రాలతాయి!"

నేను కిక్కురుమనలేదు.

"నీకు బుద్ధి లేదు. మహత్తరమైన కళను అవమానిస్తున్నావు. రవీంద్రుడు, శరత్, చలం— వీరంతా ఎందుకు గొప్పవారయ్యా రంటావు?"

విశ్వాసం మనిషిలోని కోర్కెను జ్ఞాపకం చేస్తే, ఆత్మవిశ్వాసం కర్తవ్యాన్ని గుర్తు చేస్తుంది. ఆత్మోన్నతమైనదే మనిషి బ్రతుకు. పిరికితనం బ్రతికుండగానే చచ్చినవారిని చేస్తుంది. యువతరంలోని అనుమానాల సాలెగూళ్లను తొలగించకపోతే - చరిత్ర ఏ విధంగా మారినా ఆశ్చర్యపడ నవసరం లేదేమో!

"ఏం చెయ్యను? నాకు ఈ కథలు అన్నం పెట్టడం లేదు" అన్నాను ఏడుపు ముఖంతో.

"అన్నం కోసం వీటిని రాయకు."

"మరేం చెయ్యను? ఎవ్వరూ ఉద్యోగమివ్వడం లేదు. ఉద్యోగాలు లేవు."

నా ప్రతిబింబం మాట్లాడలేదు. అది ఆలోచిస్తూంది. నాకు ఉత్సాహం వచ్చింది. నా ప్రతిబింబం నోరు కట్టేశాను.

"ఎందు కిలా అయిందంటావు?" నెమ్మదిగా అన్నది నా ప్రతిబింబం.

నేను మాట్లాడలేదు.

"నీలాటి యువకులు ఎంతోమంది ఉన్నారు" అన్నది.

నేను తల ఊపాను. అది ఆలోచించింది.

"దేశం అధోగతి పాలయింది" అన్నది.

నేను తల ఊపాను.

"కంచే చేను మేస్తూంది" అన్నది.

నేను తల ఊపాను. అది మళ్లీ ఆలోచించింది.

"ప్రభుత్వం మారాలి" అన్నది.

"మారకేం? మారుతూనే ఉంది— రోజూ మారుతూనే ఉంది. దాని మార్పుకే కాలం అంతా సరిపోతోంది" అన్నాను.

నా ప్రతిబింబం నా వైపు చూసింది.



ఇటీవల శ్రీ రాజన్న కవిని సువర్ణ కంకణంతో కడపలో సన్మానించినప్పటి చిత్రం

"అవును, నిజమే" అన్నది.

నేను నిట్టూర్చాను. అద్దంపెంకును మూల పడేశాను.

మళ్ళీ లేచి తలుపు కొద్దిగా తెరిచి, తొంగి గడియారం వంక చూశాను. నాలుగయింది. 'అమ్మయ్య' అనిపించింది. ముఖం కడుక్కోవాలి. బావి దగ్గరకు వెళ్ళాలి. బావికి ఎదురుగా గుమ్మంలోనే ఇల్లుగలాయన తిన్నె మీద కూచుంటాడు. అద్దె అడుగుతాడు. ఆలోచించాను. కూజాలో చూశాను. కొంచెం నీళ్ళు ఉన్నాయి. గదిలోనే తూము దగ్గర ముఖం కడుక్కున్నాను. తల దువ్వుకున్నాను. వెంటనే దానికి వారం రోజుల నుంచి సూనె లేదన్న సంగతి గుర్తొచ్చింది. వెంటనే సూనె లేకపోవడంకూడా స్టైలే నని జ్ఞాపకం వచ్చింది. జాగ్రత్తగా బయటికి వచ్చాను.

టైమ్ నాలుగున్నర.

ఎదురుగా ఉన్న గదిలోంచి ఓ సంసారి గబాల్న బయటికి వచ్చి ప్రేమగా నా వైపు చూసింది. ఒళ్ళు చిటపట లాడింది. పరుగెత్తినట్లు బయటికి నడిచాను.

అయ్యరు హోటల్లో దూరాను. ఓ మూలగా కూర్చున్నాను. సర్వర్ మంగళం వచ్చాడు. నా ముఖం వైపు చూశాడు. మాట్లాడకుండా రెండిడ్లీ, సాంబారూ, ఎక్స్ట్రా ఓ సాంబారు ప్లేటూ తెచ్చి నా ముందు పెట్టి వెళ్ళిపోయాడు. 'స్వంత అమ్మకూడా ఇలా పెట్టదురా' అనుకున్నాను మనసులో. త్వరితంగా తిని త్రేన్చాను. సర్వర్ అర కప్పు టీ తెచ్చి నా ముందు పెట్టాడు. టీ తాగి బయట పడ్డాను. మళ్ళీ గది లోనికి వెళ్లాను. ఆ ఎదురింటి సంసారి మళ్ళీ వచ్చి ఇకిలించింది. గబాల్న గదిలోనికి దూరబోయాను. తల గుమ్మానికి కొట్టుకుంది. "అబ్బా!" అన్నాను. ఆమె ముసిముసిగా నవ్వింది. దబాల్న తలుపు వేసి కిటికీ దగ్గర కూర్చున్నాను.

అద్దంపెంకు తీసి ముఖం చూసుకున్నాను. కళ్ళు లోతుకుపోయి, మాసిన గెడ్డంతో విచారంగా కనిపించింది నా ప్రతిబింబం.

"నా కొక అనుమానం" అన్నది అది.

"ఏమిటి?"

"ఇంతమంది కవులూ, రచయితలూ ఎన్నెన్నో ప్రబోధాత్మకమైన రచనలు చేస్తున్నారు కదా? ఈ సంఘం గుర్తించదా? ఈ ప్రభుత్వం వాటిని గూర్చి ఆలోచించదా?"

నేను వేదాంతిలా నవ్వాను.

"ఈ ప్రబోధాత్మకమైన రచనలను సాధారణంగా సామాన్యులు చదువుతారు.



పాపం, వాళ్ళేం చేస్తారు? అందుచేత సంఘం ఏమీ చేయలేదు. ఇక ప్రభుత్వం అంటావా — అందులో ఉన్న మంత్రి శిఖామణులకు 'రచన' అంటేనే తెలియదు. ఇక అర్థం చేసుకోవడం ఏమిటి? దేశాన్ని సంస్కరించడం ఏమిటి?"

నా ప్రతిబింబం మాట్లాడలేదు.

"అవును" అని మాత్రం అని వెళ్ళిపోయింది.

గాలి చల్లబడింది. రిక్షాల గణగణలూ, సైకిలుబెల్లుల టింగు టింగులూ, కార్ల హార్లనలతో రోడ్డంతా అదిరిపోతూంది. రేడియోలు 'బొంయ్'మని అరుస్తున్నాయి. ఆ సౌండ్ ఇంజినీరింగ్ షాపు వాడు మళ్ళీ ఆ లౌడ్‌స్పీకర్‌ను బయట పెట్టి రోడ్డును అదరగొట్టడం మొదలు పెట్టాడు. రహీమ్ కొట్టు మళ్ళీ రిక్షా వాళ్ళతో నిండిపోయింది. పళ్లకొట్లవాళ్ళు, పూలకొట్లవాళ్ళు మహా హుషారుగా అరుస్తున్నారు. రంగురంగుల కార్లు తామరాకుమీద జారే నీటిబిందువుల్లా పరుగెడుతున్నాయి.

అందమైన సీతాకోకచిలుకల్లాంటి అమ్మాయిలు మరింత అందంగా నడుస్తున్నారు. వారి వెనకే అందమైన అబ్బాయిలు రంగురంగుల బట్టల్లో స్టైలుగా నడుస్తున్నారు, మకరందాన్ని ఆస్వాదించడానికి వెళ్లే తుమ్మెదల్లా.

ఎందుకో నా కళ్లల్లో నీరు తిరిగింది.

చీకటి పడింది. ఆ ముగ్గురు పడుచులూ, ఆ ముసలమ్మా అన్నం బుట్టలు తెచ్చుకుని కూర్చున్నారు. గది అంతా చీకటిగా ఉంది. కిటికీలోనుంచి వెన్నెల గదిలో పడుతూంది.

మళ్ళీ ఆకలి వేస్తూంది. బ్రతుకంటేనే అసహ్యం వేస్తూంది. ఆలోచించినకొద్దీ కన్నీరు తప్పించి ఏమీ మిగలడం లేదు. ఆత్మహత్య చేసుకుంటేనో—అనిపించింది. కళ్ళు మూసుకున్నాను. కన్నీరు చెంపల మీదుగా జారి పడుతూంది.

నా ప్రతిబింబం నా వైపు చూసింది.

"ఎందు కేడుస్తావు?"

నేను మాట్లాడలేదు.

"ఇంటికి వెళ్ళు."

నేను దానివైపు చూశాను. అది నా వైపు పరీక్షగా చూస్తూంది. నేను ఆలోచించాను.

"వద్దు" అన్నాను.

"మరేం చేస్తావు?"

దానివైపు విస్మయంగా, జాలిగా చూశాను. ఏదో ఉద్రేకం ప్రవేశించింది నాలో. గబాల్న లేచాను.

"ఆగు. ఎక్కడికి?"

నేను మాట్లాడలేదు.

"చస్తావా?" అన్నది.

నేను తల వంచుకున్నాను. కన్నీరు ధారగా కారుతూంది.

"నేను అసమర్థుణ్ణి" అన్నాను.

"నువ్వు అసమర్థుడివా?!" విచారంగా నా వైపు చూసింది నా ప్రతిబింబం.

"చూశావా— నీ గురించి నీకే తెలియదు."

నేను తల ఎత్తి చూశాను.

"నువ్వు అసమర్థుడివని నీ కెలా అనిపించిందో నాకు తెలియదు. కానీ, నాకు నీలో అసమర్థత ఏమీ కనిపించడం లేదు. ఈ దేశం అసమర్థులరాలు. నీ లాంటి యువకుల్ని గుర్తించని ఈ దేశమే దౌర్భాగ్యమైనది. నువ్వు బాధపడ్డమే నేర్చుకున్నావు గాని. ఆలోచించడం నేర్చుకోలేదు. నీలో ఉన్న శక్తిని గురించి నీ కేం తెలుసు? ఎంత త్వరగా అన్నావు అసమర్థుడివని! ఇన్ని పుస్తకాలు చదివావు. ఇంత విజ్ఞానం సంపాదించావు. ఆత్మవిశ్వాసమే మనిషి బ్రతుకు, పిరికితనమే మనిషి చావు అన్నది మరిచావా?

నువ్వు యువకుడివి కాదా? నీ రక్తం ఎర్రగా లేదా? అది పరవళ్ళు తొక్కడం లేదా? ఈ శరీరానికి రక్తమెంత అవసరమో ఈ దేశానికి మీ రంత అవసరం. నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు. ప్రయత్నించడమే నీ విధి. నీ కుటుంబాన్ని పోషించడమే నీ ప్రస్తుత కర్తవ్యం. దాన్ని ఎప్పుడూ మరిచిపోకు. నీ ఈ దృక్పథమే సంఘాన్ని మారుస్తుంది. ఈ దేశాన్ని సుభిక్షం చేస్తుంది. ఒక్కసారి ఆలోచించు. కర్తవ్యంతో ఉన్న ఆనందాన్ని మరిచిపోకు."

కొబ్బరిచెట్లలోనుంచి సందు చేసుకుని చంద్రుడు చూస్తున్నాడు. నక్షత్రాల మధ్య ధగధగలాడుతూ ఎంత అందంగా ఉన్నాడు!

మనస్సుకు ఏదో నూతనోత్సాహం వచ్చింది. రోడ్డుమీద గడియారపు స్తంభం పన్నెండు కొట్టింది. మనస్సు ఆనందంతో ఉరకలేస్తున్నది.

రోడ్డుమీద ట్యూబ్‌లైట్లు తెల్లని, చల్లని వెలుగును విరజిమ్ముతున్నాయి.

రహీమ్ గాఢంగా నిద్రపోతున్నాడు. గదిలోని దీపం వెలిగించాను. చాపమీద ఉద్యోగానికి అప్లికేషన్ ఫారమ్ ఫిలప్ చేసి ఉంది. స్టాంపులు అంటించాలి. డబ్బు ల్లేవు. ఆలోచించాను.

ఎదురుగా నేను వ్రాస్తున్న వ్యాసం కనిపించింది. దీన్ని ఆ పత్రికకు పంపితే, ఆ పత్రికా సంపాదకులు డబ్బు ఇస్తే, స్టాంపులు కొని దీన్ని పోస్టు చేయవచ్చు.

కలం సిరాబుడ్డిలో ముంచాను. ఏదో జ్ఞాపకం వచ్చింది.

"అన్నం కోసం నీటిని రాయకు" అన్న నా ప్రతిబింబపు మాటలు గుర్తొచ్చాయి. ఒక్కసారి ఆగాను. నా ప్రతిబింబం వైపు చూశాను. అది చిన్నగా నవ్వింది.

ద్విగుణీకృతోత్సాహంతో వ్యాసాన్ని పూర్తిచేయడానికి కూర్చున్నాను. *